


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**DECEMBER 2005**

సంవత్సర చందా రూ. 50/-

## క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

## సత్యవాణి టి.వి. కార్యక్రమములను

| | | |
|---|---|---|
| ప్రతి మంగళవారం | : | ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను |
| ప్రతి శనివారం | : | ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి |
| ప్రతి గురువారం (కాకినాడలో మాత్రమే) | : | SITI కేబుల్ & IN కేబుల్‌లో ఉదయం 7:00 గం॥లకు, సాయంత్రం 5:30 గం॥లకు |
| ప్రసంగీకులు | : | బ్రదర్. జాషువా గూటం<br>బ్రదర్. రిక్కీ గూటం |

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.O.Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 26 డిశంబర్ 2005 సంచిక 5


# శత్రువులు యేసు శరీరమును ఎత్తికొనిపోయిరా?

(Did the enemies remove the body?)

క్రైస్తవ్యమునకు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము అతి ప్రాముఖ్యమైనది. నిజానికి క్రైస్తవ్య మంతయును క్రీస్తు పునరుత్థానము మీదనే ఆధారపడి యున్నది అని మనము గత సంచికలో గ్రహించాము. క్రీస్తు చనిపోయిన తరువాత ఆయన శరీరమును సమాధిలో యుంచగా మూడవ దినమున అది మాయమాయెను. అది అట్లగుటకు కనీసము మూడింటిలో ఏదో ఒకటి జరిగి యుండవచ్చు : అవి, క్రీస్తు శత్రువులు ఆయన దేహమును ఎత్తుకొనిపోయిరి లేదా క్రీస్తు శిష్యులు దాని నెత్తుకొని పోయిరి లేదా ఆయన సజీవుడై లేచెను. జరుగుటకు అవకాశము ఉన్న ఈ మూడు సందర్భములలో ఒకొక్క దానిని

ఇప్పుడు పరిశీలించుదము.

క్రీస్తు సమాధిచేయబడిన మూడవ దినమున ఆయన శరీరము సమాధిలో లేకుండపోయెను. అయితే ఆయన శత్రువులు ఆయన శరీరమును తీసికొని పోయిరా? ఈ ప్రశ్నకు 'అవును' అని జవాబిచ్చువారు అనేక అసాధ్యములు నెదుర్కొనవలసివచ్చును. అట్టివారు క్రీస్తు శరీరమును తీసికొనిపోవుటలో యూదులకు గల అభిప్రాయమును తెలియ జెప్పుట దుస్సాధ్యమైనది. ఏమయినను సరే ఆయన శరీరము సమాధిలోనే యుండవలెనని వారు తలంచిరి. క్రీస్తు తగినరీతిగ చంపబడెనని వారు నమ్మిరి. అంతేకాదు, సమాధి చేయబడిన తరువాత పునరుత్థానమును గూర్చి క్రీస్తు చెప్పిన మాటలను వారు జ్ఞప్తికి తెచ్చుకొని వారు ప్రభుత్వ అధిపతియైన పిలాతునొద్దకు వచ్చి, "అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు, మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయ నాజ్ఞాపింపుము" అని వేడుకొనిరి (మత్త 27:62,63). "అందుకు పిలాతు - కావలివారున్నారు గదా, మీరు వెళ్ళి మీ చేతనైనంతమట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారు వెళ్ళి కావలి వారిని కూడ ఉంచుకొని, రాతికి ముద్రవేసి సమాధిని భద్రము చేసిరి" (మత్త 27:65, 66). దీనినిబట్టి ఏ సందర్భము లోనైనను క్రీస్తుయొక్క మృతదేహము సమాధిలోనే యుండవలెనని వారు ఏర్పాటు చేసిన తరువాత అదే దేహమును వారు దొంగిలించుటలో గల ఉద్దేశ్యమేమిటో మనము చెప్పుకొనలేము. ఎవరును ఆ శరీరమును ఎత్తుకొని పోకుండుటకే వారు ప్రయత్నించిరి.

క్రీస్తు శత్రువులకు వెనుక ఏదో ఒక అభిప్రాయమున్నదనియు, అందుచే వారు ఆ శరీరమును ఎత్తుకొని పోయిరనియు మనము అంగీకరించినను ఆ కార్యమును వారెట్లు సాధించిరో ఊహించుట అసాధ్యము. ఒకవేళ వారు దానిని సాధించగలిగియుంటే రోమాదేశం చట్ట ప్రకారము అట్టి క్రియ ననుసరించి నాలుగు విధములుగ మరణశిక్ష విధించబడవలెను. క్రీస్తు యొక్క సమాధి రోమా ప్రభుత్వ ముద్రతో మూయబడినది. చట్టప్రకారము ఆ ముద్రను భంగపరచు వానికి మరణశిక్షకు విధించబడవలెను. ఆ ముద్రను చెఱచుట అవకాశమిచ్చిన కావలివారికి చట్టప్రకారము మరణశిక్ష విధింపబడవలెను. ముద్ర వేయబడి సమాధిలోని శరీరమును దొంగిలించు వారు మరణశిక్ష పాత్రులు. అట్టి శరీరమును దొంగిలించుటకు కవకాశమిచ్చిన కావలి వారు కూడ మరణశిక్షకు

పాత్రులు. ఇన్ని విధములుగ మరణ దండన విధింపబడుటకు అవకాశ మున్నప్పుడు ఎవనికినీ అట్టి శిక్షవిధింప బడలేదు. ఏలయనగా యేసు శత్రువు లలో యెవడును ఆయన శరీరమును దొంగిలించి యుండలేదు.

పెంతెకోస్తు అనుపండుగ దినమున పేతురు మిగిలిన 11 మంది అపొస్తులులతో కలసి, యేసును సిలువ వేసిన వేలకొలది ప్రజల మధ్య నిలబడి, మీరు దుష్టుల చేత ఆయనను సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనన్ను లేపెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము అని నిర్భయముగా బోధించెను. ఒకవేళ శత్రువు లెవరయినను క్రీస్తు శరీరమును దొంగిలించిన యెడల ఈ ప్రత్యేక సమయ మందువారు దానినెందుకు బయలుపరచలేదు? ఎత్తుకొని పోయిన దేహమును వారు ప్రజలందరి యెదుట బహిరంగముగా సమర్పించుటచే అపొస్తలుల నందరినీ అబద్ధికులనుగా చేసే అవకాశము వారికున్నను దానిని వారు వినియోగించుకొనలేకపోయిరి. అంటే దానికి ఒకేఒక్క సమాధానము ఉన్నది. వారు క్రీస్తు శరీరము ఎత్తుకొని పోలేదు.

అంతేకాదు, ఆనాటి వారి ప్రవర్తన మరింత ఆశ్చర్యముగా మనకు కన్పడు చున్నది. యెరూషలేములో పెంతెకోస్తు పండుగనాడు కూడివచ్చిన వేలకొలది ప్రజలకు పేతురు, క్రీస్తు యొక్క జీవిత మును, మరణమును ఒక్కసారి ఈ రీతిగ జ్ఞాపకము చేసెను : "ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతము లను, మహత్కార్యములను, సూచక క్రియలను మీ మధ్య చేయించి ఆయనను తనవలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను; ఇది మీరే యెరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును, ఆయన భవిష్యత్ జ్ఞాన మును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ చేయించి చంపితిరి. మరణము ఆయ నను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను. "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (అపో.కా. 2:22-24;37). క్రీస్తు మృతులలో నుండి లేచెనని పేతురు ధైర్యముతో ప్రకటింపగా యీ యూదులు దానిని నిరాకరించుట మాని అది యధార్థమని అంగీకరించిరి.

వారు పేతురు చేసిన గొప్ప ప్రబోధమును విని, దైవజనుడైన క్రీస్తు మరణములో అపరాధులమని గ్రహించి, పేతురును, కడమ అపొస్తలులను ఒక ప్రశ్నను అడిగిరి - అయ్యా, మేమేమి చేయ వలెను? రక్షణ పొందుటకు మేమేమి చేయవలెను? అని వారడుగగా పేతురు "మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారికి జవాబిచ్చెను. అంతట వారు క్రీస్తు పునరుత్థానమును గూర్చి వ్యాజ్య మాడలేదు గాని, పేతురు చెప్పిన రీతిగ క్రీస్తునామమున మూడు వేలమంది బాప్తిస్మము పొందిరి. కొన్ని దినముల క్రితమే క్రీస్తును సిలువ వేయుము, సిలువ వేయుము అని అరచిన ఈ ప్రజలు క్రీస్తు నిజముగా తిరిగి లేచెనని నమ్ముట మాత్రమే గాక, ఆయనలో లీనమగుట ఆశ్చర్యము కాదా? పెంతెకోస్తు నాటి వారి ప్రవర్తనే చెప్పుచున్నది - వారు ఆయన శరీరమును సమాధినుండి ఎత్తుకొని పోలేదని.

క్రీస్తు శత్రువులు ఎవరును, ఎప్పుడును మేము ఆయన శరీరమును ఎత్తుకొని పోతిమి అని ఆరోపించలేదు. అట్టి దేదయినను జరిగితే క్రీస్తు శిష్యులే ఆ పనిని చేసియుందురని వారారోపించిరి గాని, వారు మాత్రము ఆ పనిని చేసినట్లు ఎన్నడు ఆరోపించలేదు.

అంతేకాదు క్రీస్తు శిష్యులు ఆయన శత్రువులు ఆయన శరీరమును ఎత్తుకొని పోయిరని కూడ ఎన్నడు నిందించలేదు. సరిగదా క్రీస్తు లేచినపుడు మహా భూకంపము కలిగెను. కావలివారు భయపడి వణకి చచ్చినవారి వలెనుండిరి యని శిష్యులు చెప్పిరిగాని శత్రువులపై వారు ఎన్నడును నిందారోపణ చేయలేదు.

సమాధి దగ్గర "కావలియున్న వారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులను అన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి. కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచన చేసి ఆ సైనికులకు చాల ద్రవ్యమిచ్చి మేము నిద్రపోవు చుండగా అతని (క్రీస్తు) శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తికొనిపోయిరని మీరు చెప్పుడి. అది అధిపతి చెవిని బడిన యెడల మేమతని సమ్మతిపరచి మీ కేమియు తొందర కలుగకుండ చేతుమని చెప్పిరి" (మత్త. 28:11-14).

ఇప్పటివరకు మనము చేసిన పరిశోధనలను బట్టి సమాధిలో యున్న క్రీస్తు శరీరమును ఎత్తికొనిపోవుటలో కలిగే ప్రయోజన ఏమియు లేనందున, అట్టి అభిప్రాయము వారికి లేనందున

శత్రువులు ఆయన శరీరమును ఎత్తుకొని పోయి యుండలేదని మనకు నిర్ధారణ యగుచున్నది. అంతేకాదు, అట్టి క్రియలో ఇమిడియున్న మరణశిక్షల మూలముగను, నిరాకరించుటకు పెంతెకోస్తు దినమున అవకాశము దొరుకగా క్రీస్తు శత్రువులెవరు ఆయన పునరుత్థానమును నిరాకరించక పోవుటయే గాక, అంగీకరించినందునను క్రీస్తు శత్రువు లెవరు ఆయన శరీరమును సమాధి నుండి ఎత్తికొనిపోలేదని మనకు మరింత ధృఢముగ నిర్ధారణ యగుచున్నది. వచ్చే సంచికములో క్రీస్తు శిష్యులు ఆయన శరీరమును సమాధినుండి ఎత్తికొనిపోయిరా? అనే ప్రశ్నను పరిశోధింతము.

ఈలోగా పునరుత్థానుడైన క్రీస్తు నందు విశ్వాసముంచుటయే గాక ఆయన సువార్తకు మీరు విధేయులగుట అత్యంత ప్రాముఖ్యమని మీరు గమనించగోర్తాను.

✦✦ ✦✦

# పాపము నుండి విడుదల - 3

## (Deliverance from Sin)

ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విమోచించుటకు యెహోవా మోషేను వారికి నాయకునిగా నియమించెను. వారతనియందు విశ్వాసముంచిరి, మారుమనస్సు నొందిరి. మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి. దేవుని హస్తము ఐగుప్తీయులను నాశనము చేయుటయే గాక, తమ్మును రక్షించుటకూడా వారు చూచిరి. దేవుని మహిమపరచిరి. నేడు మానవులను పాపము యొక్క బానిసత్వము నుండి విమోచించుటకు దేవుడు తన ఏకైక కుమారుడైన యేసు క్రీస్తును పంపెను. మానవులు ఆయన యందు విశ్వాసముంచవలెను; తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, అట్టివారిని ప్రభువు రక్షించి తన సంఘముతో తానే చేర్చుకొనును.

ఇశ్రాయేలీయులు ఐగుప్తును వీడి వాగ్ధానము చేయబడిన కానాను ప్రయాణము చేయుచుండగా అద్భుతరీతిగా యెహోవా దేవుడు వారిని నడిపించెను. ఆయనే నిజానికి వారికి మార్గ దర్శియై యుండెను. "వారు పగలు రాత్రియు ప్రయాణము చేయునట్లుగా యెహోవా త్రోవలో వారిని నడిపంచుటకై పగటివేళ మేఘస్థంభములోను, వారికి వెలుగిచ్చుటకు రాత్రి వేళ అగ్నిస్థంభములో

నుండి వారికి ముందుగా నడుచుచు వచ్చెను. ఆయన పగటివేళ మేఘస్తంభ మునైనను, రాత్రివేళ అగ్నిస్తంభమునైనను ప్రజల యెదుట నుండి తొలగింపలేదు" (నిర్గమ 13:21, 22).

నేడు మనకు యేసుక్రీస్తు మార్గ దర్శియై యున్నారు. "యేసు తన శిష్యులను చూచి ఎవడైనను నన్ను వెంబడింప గోరిన ఎడల తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింప వలెను" అని చెప్పెను (మత్తయి 16:24; మార్కు 8:34; లూకా 9:23). "మరల యేసు నేను లోకమునకు వెలుగును. నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండునని వారితో చెప్పెను" (యోహాను 8:12). అపో. పేతురు ఇట్లనుచున్నాడు: "క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి మీరు తన అడుగుజాడల యందు నడచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1 పేతురు 2:21). యేసుక్రీస్తును అనుకరించుచు, ఆయన ఆజ్ఞలకు లోబడుచు మనము ఈనాడు ఆయనను వెంబడింపవలెను. యేసు తన జీవితము యొక్క మాదిరిని బట్టియేగాక ఈనాడాయన తన వాక్యము ద్వారా మనలను నడిపించుచున్నారు. "నీ వాక్యము నాపాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది" యని అందుకే భక్తుడైన దావీదు వ్రాసెను (కీర్తన 119:105). ఆయనను మనము హృదయపూర్వకముగా వెంబడించ వలెను.

అటు యిటు బెసుకుచున్న విశ్వాసముతో మనము ఆయనను వెంబడింప లేము. కొందరు కొంతమట్టుకు దేవుని వాక్యమును, మరికొంతమట్టుకు మానవ కల్పిత సిద్ధాంతములను వెంబడింతురు. అట్టివారు దేవునికి చేయు పరిచర్య, ఆరాధన అంతయు వ్యర్థమేనని యేసు ప్రభువు చెప్పెను (మత్తయి 15:9). మనము క్రీస్తును హృదయపూర్వకముగా వెంబడింపవలెనంటే మానవకల్పిత సిద్ధాంతములను ఆచారములను ప్రమాణ పుస్తకములను, మత శాఖలను సంపూర్తిగా విసర్జించవలెను.

ఇశ్రాయేలీయులు అరణ్యము గుండా ప్రయాణము చేయుచున్నప్పుడు దేవుడు వారికి అద్భుతరీతిగా ఆహారమును సరఫరా చేసెను. "సాయంకాలమున పూరేడులువచ్చి వారిపాళెమును కప్పెను, ఉదయమున మంచు వారిపాళెము చుట్టుపడియుండెను. పడిన ఆ మంచు ఇగిరిపోయిన తరువాత నూగమంచువలె సన్నని కణములు అరణ్యపు భూమిమీద కనబడెను. మోషే, ఇది తినుటకు యెహోవా మీకిచ్చిన ఆహారము" అని

వారితో చెప్పెను. "ఇశ్రాయేలీయులు దానికి మన్నా అను పేరు పెట్టిరి. అది తెల్లని కొతిమెర గింజవలె నుండెను" (నిర్గమ 16:13-16). "ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తామువచ్చు నలుబది యేండ్లు మన్నానే తినుచుండిరి; వారు కానాను దేశపు పొలిమేరలు చేరువరకు మన్నాను తినిరి" (నిర్గమ 16:35).

ఇశ్రాయేలీయులు అరణ్యములో పూరేళ్ళను మన్నాను ఆహారముగా తినిన యెడల మరి ఈనాడు మన ఆత్మీయాహార మేమిటి? యేసు తనకాలపు యూదులతో ఇట్లనెను : "పరలోకము నుండి వచ్చు ఆహారము మోషే మీకియ్యలేదు. నాతండ్రియే పరలోకము నుండి వచ్చు నిజమైన ఆహారమును మీకను గ్రహించు చున్నాడు. పరలోకము నుండి దిగివచ్చి లోకమునకు జీవమునిచ్చునది దేవుడను గ్రహించు ఆహారమై యున్నదని నిశ్చయ ముగా మీతో చెప్పుచున్నాని వారితో చెప్పెను. కావున వారు ప్రభువా ఈ ఆహారము ఎల్లప్పుడును మాకను గ్రహించుమనిరి. అందుకు యేసు వారితో ఇట్లనెను: జీఆహారము నేనే; నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచు వాడు ఎప్పుడును దప్పిగొనడు" అని చెప్పెను (యోహాను 6:32-35). "మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి. దీనిని తినువాడు చావకుండునట్లు పరలోకము నుండి దిగివచ్చిన ఆహారమిదే. పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారము నేనే; ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడు జీవించును మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవము కొరకైన నా శరీరమే అని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానెను" (యోహాను 6:49-51).

ఇశ్రాయేలీయులు తమ్మును వెంబడించిన బండలోనిది త్రాగిరి : ఆ బండ క్రీస్తే అని అపొ.పౌలు 1 కొరింథీ 10:4లో వ్రాసియున్నాడు. ఆ బండ క్రీస్తుకు మాదిరిగా యున్నది. "కావున యేసు ఇట్లనెను. మీరు మనుష్య కుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితినేకాని మీలో మీరు జీవము గల వారు కాదు. నా శరీరము తిని నా రక్తము త్రాగువాడే నిత్యజీవముగలవాడు; అంత్య దినమున నేను వానిని లేపుదును. నా శరీరము నిజమైన ఆహారమును, నా రక్తము నిజమైన పానమునై యున్నది" (యోహాను 6:53-55). ఆయన శరీరమును తిని ఆయన రక్తమును నిజముగా మనము పానము చేయవలెనని యేసు యొక్క ఉద్దేశ్యము కాదుగాని ఆయన చిత్తమును జరిగించుట ద్వారా

ఆయన శరీర రక్తముల శక్తిని మనము పొందచవచ్చును అని ఆయన ఉద్దేశము. అందుకే "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమగు పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను ఆపేక్షించుడి" యని అపొ. పేతురు చెప్పెను (1 పేతు 2:3). ఆత్మీయాహారము లేకుండ ఆత్మీయ జీవితము నశించును. మనదేశమంత టను క్రైస్తవులని చెప్పుకొనువారు ఆత్మీయ ఆహారము ఆత్మీయపానము లేక నశించి పోవుచున్నారు. నిజానికి అనేకులు క్రైస్తవులమని చెప్పుకొనుచు జీవించు చున్నారేగాని వారు ఆత్మీయముగా మృతులే.

ఇశ్రాయేలీయులు అరణ్యముగుండా ప్రయాణము చేయు చున్నప్పుడు తమస్వజ్ఞానము పై ఆధారపడలేదు. మోషే ద్వారా దేవుడు వారికి బోధించుండెను. మేఘస్థంభముగను అగ్నిస్థంభముగను దేవుడు వారిని తమ ప్రయాణమంతటిలోను నడిపించెను. ఇశ్రాయేలీయులు యెహోవాపై అనుకొని, ఆయనయందు నమ్మికయుంచి ప్రయాణము చేసిరి.

క్రైస్తవ జీవితములో మన ప్రయాణము కూడ విశ్వాస ప్రయాణమే. తమ మార్గమును ఏర్పరచుకొనుట నరుల వశములో లేదని దేవుని వాక్యము చెప్పు చున్నది (యిర్మీయా 10:23). దేవుని యొక్క బయల్పాటు లేనిదే ఎవడును రక్షణ మార్గమును, రక్షణ జీవితమును కనుగొనలేడు. ఈ రక్షణ మార్గమును ఆయన యేసు క్రీస్తులోను, క్రొత్తనిబంధన గ్రంథములోను, మనకు బయలుపరచి యున్నాడు. దేవుని యందు నమ్మిక యుంచి ఆయన యిచ్చిన బయల్పాటును వెంబడించుటయే మనకు శ్రేయస్కరము. ఇశ్రాయేలీయులలో అనేకులు అవిశ్వాసము వలన, అవిధేయత వలన పడిపోయిరి. అట్లేమనలో ఎవడును పడిపోకుండ జాగ్రత్త పడవలెనని హెచ్చరిక చేయబడి యున్నది (హెబ్రీ 4:11).

దేవుని చిత్తమును అధిగమించి మానవులు తమకు తామే ఆత్మీయ విషయాల్లో చట్టములను, విశ్వాస ప్రమాణములను ఏర్పరచుకొనుట అవిశ్వాసమును నిర్ధారణ చేయు చున్నది. దేవుని చిత్తమునందును, దేవుని జ్ఞానము నందును విశ్వాసము లేకపోవుటచే మానవులు ఆయన సంఘమును శాఖలుగా చీల్చి వివిధ ప్రణాళికలను ఏర్పరచుకొని వాటిని నడిపించుచున్నారు. అయితే క్రీస్తు స్థాపించిన సంఘము ఒకే ఒక్కటి యున్నది. మతశాఖలు దైవ సంకల్పములో లేనివి, అవి మానవ

కల్పితములే యని దేవుని గ్రంథము బోధించుచున్నది. "పరలోక మందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింప బడును" అని యేసు ప్రభువు చెప్పిన దానిని జ్ఞాపక ముంచుకొందము (మత్తయి 15:13).

ఇశ్రాయేలీయులలో "ఎక్కువమంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి గనుక వారు అరణ్యములో సంహరింపబడిరి" (1 కొరింథి 10:15). "మరియు యెహోవా మోషే అహరోనులకు ఈలాగు సెలవిచ్చెను. నాకు విరోధముగా సణుగు చుండు ఈ చెడ్డ సమాజమును నేనెంత వరకు సహింపవలెను? నాజీవము తోడు మీశవములు ఈ అరణ్యములోనే రాలును; మీ లెక్క మొత్తము చొప్పున మీలో లెక్కింపబడిన వారందరు అనగా ఇరువది యేండ్లు మొదలుకొని పై ప్రాయము గలిగి నాకు విరోధముగా సణగిన వారందరు రాలిపోవుదురు. యెపున్నె కుమారుడైన కాలేబును నూను కుమారుడైన యెహోషువయు తప్ప, నేను ప్రమాణము చేసిన దేశమందు మీలో ఎవరును ప్రవేశింపరు. ఇది నిశ్చయము. అయితే వారు కొల్లపోవుదురని మీరు చెప్పిన మీ పిల్లలను నేను ఆ దేశము లోపలికి రప్పించెదను. మీరు తృణీ కరించిన దేశమును వారు స్వతంత్రించు కొనెదరు" (సంఖ్యా 14:26-21).

"వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు దష్టాంతములుగా యున్నవి. ఈ సంగతులు దృష్టాంతము లుగా వారికి సంభవించి యుగాంత మందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను. తాను నిలుచుచున్నానని తలంచు కొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" అని అపొ.పౌలు ఈనాటి క్రైస్తవులను హెచ్చ రించుచున్నాడు (1 కొరింథీ 10:6, 11,12). రక్షింపబడిన విశ్వాసి పడి పోవుట సంభవమయితే ఈ హెచ్చరిక వ్యర్థమే.

ఇశ్రాయేలీయులు దేవుడు తమకు వాగ్దానము చేసిన కానాను దేశములో ప్రవేశించక ముందు వారు యొర్దాను నదిని దాటవలసి వచ్చెను. ఎర్ర సముద్రము దాటించుటలో అద్భుతరీతిగా యెహోవా వారికి ఎట్లు సహాయము చేసెనో అట్లే యొర్దాను నదిని వారు దాటుటలో కూడ ఆయన వారికి అద్భుత రీతిగ సహాయచేసెను (యెహోషువ 3వ అధ్యా).

క్రీస్తునందు నమ్మకముగా జీవించిన వానికి ఆయన పరలోకమును వాగ్దానము చేసియున్నాడు. మనకువాగ్దానము చేయ బడిన ఆ స్వాస్థ్యములో ప్రవేశించకముందు

మనము మరణమును దాటి వెళ్ళవలయును. అయితే క్రీస్తునందున్న వారికి ఈ మరణ భయములేదు. ఆయన తన కృపగల హస్తముతో మరణము నుండి జీవమునకు వారిని దాటించును. ఎటొచ్చీ క్రీస్తులో లేనివారికి మాత్రము మరణ భయము ఉండును. ప్రతివాడును ఈ నదిని దాటి వెళ్ళవలసినదే.

ఇశ్రాయేలీయులను దేవుడు ఆశ్చర్య రీతిగా బానిసత్వము నుండి విడిపించి కానానులో ప్రవేశింపజేసి మనకుముందు గానే తన నిర్ధారణను ఇచ్చియున్నాడు. మనలను పాపపు బానిసత్వము నుండి విడిపించి తన ఆశ్చర్యకరమైన మహిమ లోనికి ఆయన తప్పక నడిపించగల దేవుడై యున్నాడు. పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసు ప్రభువు చెప్పెను. నీవు దాని దాసత్వమునుండి విమోచింపబడ గోరుచున్న యెడల ఈరోజే యేసు ప్రభువునందు విశ్వాస ముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సు నొందుము. పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది మరణము నుండి జీవములోనికి దాటుము. నీవు ఆలసించిన ఆశాభంగము కాగలదు సుమా!

- జాషువా గూటం

✦✦ ✦✦

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు 'మా టి.వి.' లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్ లోను చూడండి.

# మానవునకు సాటియైన సహాయము దాని భావమేమిటి?

(What Deos it mean to Be a Helper Comparable to man?)

ఆదాము సమస్త పశువులకును, ఆకాశ పక్షులకును, సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను. అయినను ఆదామునకు సాటియైన సహాయము అతనికి లేకపోయెను (ఆది.కా. 2:20). దేవుడు తన స్వరూపములో నరుని సృజించి, ఆయన మనకును, దేవునిచే సృష్టించబడిన సృష్టికిని మధ్య సత్సంబంధ ముండునట్లు నరునకు జ్ఞానమును, భావోద్రేకములను, ఆత్మను అనుగ్రహించెను. దేవునిచే సృష్టింపబడిన ఈ సౌందర్యమైన సృష్టి యంతటిని గూర్చి ముచ్చటించుకొనుటకు తన స్వజాతి వారెవరును లేరని ఆదాము తలంచు కొనెను.

నిజానికి మానవ సృష్టిలో ఆదాము సగము భాగము మాత్రమే. అతడు జీవించుచు పూర్తి వ్యక్తిత్వము గల వానిగా భావించు కొనుచుండినను, లైంగిక పరముగ, శారీరకముగ, మానసికముగ, సాంఘికముగ ఉద్వేగ పరముగ అతడు పూర్తి మానవుడగుటకు ఆదాముకు సాటియైన సహాయము కావలెనని దేవునికి తెలియును. కాబట్టి ఆదాము తన ఒంటరి తనమును గూర్చి తలంచు కొనినప్పుడు దేవుడు అతనికి గాఢ నిద్రను కలుగ జేసి అతని ప్రక్క నుండి ఒక ఎముకను తీసెను. అతని ప్రక్క నుండి తీసిన ఎముక నుండి మట్టి నుండి కాదు – దేవుడు స్త్రీని చేసి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదాము నా ఎముకలలో ఒక ఎముక, నా మాంసములో మాంసము ఇది నరునిలో నుండి తీయబడెను. గనుక నారి అనబడును అని చెప్పెను (ఆది.కా. 2:23).

ప్రస్తుత ప్రపంచములో కొంతమంది పురుషులు, స్త్రీలు కూడ వివాహము చేసి కొనుటకు యిష్టపడక వారు ఒంటరి జీవితము జీవించుచున్నారు. వారిలో కొంతమంది దేవుని సేవకు సమర్పించు కొనుటకు నిశ్చయించుకొని, వారు దేవుని ప్రేమించుట ద్వారా మానవ సహవాసము నందు కూడ ఆశ కలిగి యుంటున్నారు.

మరికొన్ని సందర్భములలో వేరు, వేరు పరిస్థితులను బట్టి వివాహము చేసి కొనుటకు ఆటంకముల కలుగుచున్నవి.

కొన్ని సందర్భములలో వీటిని అంగీకరించవచ్చు. కాని అనేక మంది స్త్రీ, పురుషులు మానవ సహజత్వమును బట్టి వివాహము చేసికొని వారి కుటుంబములతో యుండటకు ప్రాధాన్య మిచ్చుచున్నారు. పురుషులకు భార్య యొక్క ప్రేమ, గృహమును యేర్పరచుకొను విషయములో శ్రద్ధ, జాగ్రత్తలు అత్యవసరము. స్త్రీలకయితే భర్త యొక్క సంరక్షణ, కాపుదల అవుసరము. స్త్రీ, పురుషులిరువురకును బిడ్డలను కని, వారి తరువాత వారి సంతానము జీవించి యుండ వలెననెడి సహజమైన అవుసరము లేక కోరిక, ఈ ముఖ్యమైన అవసరతలన్నిటిని మానవ నైజములో దేవుడే యేర్పరచినందున వాటిని మనము అంత తేలికగా విస్మరించరాదు.

మానవుడు జంతువుల విషయములో సరిపోల్చినట్లయిన ఏ స్త్రీకైనా, ఏ పురుషుడైనా సరిపోవును. ఎందుకనగా వారు మానవులు గనుక కొంతమంది పురుషులు, కొంతమంది స్త్రీలకు సాటియైన సహాయకారులుగా సరిపోరని మనకు తెలుసు. ఈ విషయములో అందరి అభిప్రాయములు, ఉద్దేశములు ఒకేవిధముగ యుండవు. కొన్నిసార్లు ఒక విద్యాధికుడు ఒక విద్యలేని స్త్రీని వివాహమాడవచ్చును. అది కేవలము ఆమెపై గల మక్కువ మాత్రవే. కొన్ని సందర్భములలో సుహృద్భావము కలిగిన జ్ఞానవంతురాలైన స్త్రీ తన జీవితములో చేసిన పెద్ద పొర బాటును బట్టి సంకుచిత స్వభావముగల ఒక వ్యక్తిని భర్తగ పొంద వలసి వచ్చును.

## స్త్రీ సాటియైన సహాయకారిగ ఏలాగుండగలదు?

మనము తెలుసుకొనిన రీతిగ ఆమె తన భర్తకు జీవిత భాగస్వామి. ప్రారంభము నుండియు దేవుడు విడాకులను యేర్పరచలేదు. ఒక పురుషునికి ఒక స్త్రీ మాత్రమే యని దేవుడు యేర్పరచెను. ఆయన సృజించిన వాడు ఆది నుండి వారిని పురుషునిగాను, స్త్రీనిగాను సృజించెననియు ఇందు నిమిత్తము పురుషుడు తన తల్లి దండ్రులను విడచి తన భార్యను హత్తుకొనును. వారిద్దరు ఏకశరీరముగ యుందురు. కాబట్టి వారితను యిద్దరు కాక, ఏకశరీరముగ యున్నారు గనుక దేవుడు జతపరచిన వానిని మనుష్యుడు వేరుపరచ కూడదని యేసు చెప్పెను (మత్తయి 19:4-6).

జీవిత భాగస్వాములుగ వారు ఒకరినొకరు అర్ధము చేసికొనుచు జ్ఞానమందు అభివృద్ధి చెందు చుందురు. వారు ఒకరికొకరు ఒంటరిగా యండక జీవితములో కలిసి యుండుట వలన కలిగే సంతోషాన్ని వారు అనుభవించుదురు. వారు

ఒకరి కొకరు సరిపడిన వారైతే ఒకరి ఉద్దేశములను, తలంపులను ఒకరి కొకరు సమర్ధించు కొనుచు వారి యౌవ్వ నమును గడుపుదురు. వృద్ధాప్యముందు కూడ వారి బలహీనతలను అనారోగ్యము లను బట్టి ఒకరికొకరు జాగ్రత్త వహించు కొందురు.

నరునకు సాటియైన సహాయకారి అనగా పురుషుని యొక్క అసమర్థత వలన చేయలేక విడిచిన యే కార్యము నైనను పూర్తిచేయుటకు సమర్థత గలిగిన వ్యక్తిగా యుండుట. సర్వసాధారణముగ అది పురుషులు చేసే పని అయి యుండ వచ్చును. లేదా జీవితములో మరియే యితర విషయములను గూర్చిన బాధ్యత అయి యుండవచ్చును. ఏ వ్యవసాయ దారుడైనను తన పొలములో పంట వేయుటకు వాటిని పెంచుటకు పంట కోయుటకు భార్య యొక్కయు, బిడ్డల యొక్కయు సహాయము తీసి కొన కుండునా? చిన్న, చిన్న వ్యాపార ములు చేసికొను వ్యాపారస్థులు తమ వ్యాపార ములో పద్దులు సరిచూచుట లోను, క్రొత్త వస్తువులు తెప్పించుటలోను, వ్యాపారము సక్రమ ముగ నడుపుటలోను తమ భార్యల పై ఆధారపడి యుందురు. క్రొత్తనిబంధ నలో అకుల, ప్రిస్కిల్ల అను వారు భార్య భర్తలు. వారు వృత్తికి డేరాలు కుట్టువారు. అటు తరువాత పౌలు ఏథెన్సు నుండి బయలుదేరి కొరింథునకు వచ్చి పొంతు వంశీయుడైన అకుల అను ఒక యూదుని అతని భార్యయైన ప్రిస్కిల్లను కనుగొని వారి యొద్దకు వెళ్లెను. యూదులందరు రోమా విడిచి వెళ్లి పోవలెనని క్లౌదియ చక్రవర్తి ఆజ్ఞాపించినందున వారు. ఇటలీ నుండి క్రొత్తగా వచ్చిన వారు. వారు వృత్తికి డేరాలు కుట్టువారు. పౌలు అదే వృత్తి గలవాడు గనుక వారితో కాపుర ముండెను (అపొస్త.కా 18:1-3).

వాక్యానుసారముగ స్త్రీ బిడ్డలను కని పెంచి, బిడ్డలను గూర్చియు, భర్తను గూర్చియు, ఇంటిని గూర్చియు జాగ్రత్త తీసికొనుట ఆమె యొక్క ప్రధానాంశమై యున్నది. అలాగుననే వృద్ధ స్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానా సక్తులునై యుండక ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలె ననియు, దేవుని వాక్యము దూషింపబడక యుండునట్లు, యౌవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి, తమ భర్తలను, శిశువులను ప్రేమించు వారును, స్వస్థబుద్ధి గలవారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొను వారును, మంచివారునై యుండవలెనని బుద్ధి చెప్పుచు, మంచి ఉపదేశము చేయు వారునై యుండవలెనని బోధించుము (తీతు 2:3-5). యౌవ్వనులైన విధవ

రాండ్రను హెచ్చరించుమని పౌలు తిమోతికి ఈవిధంగ చెప్పుచున్నాడు. "కాబట్టి యౌవ్వన స్త్రీలు వివాహము చేసికొని, పిల్లలనుకని, గృహ పరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి అవకాశ మీయకుండవలెనని కోరు చున్నాను (1తిమోతి 5:14). ఈ పై మాటలు యావ్వనస్థులైన విధవరాండ్రకు మాత్రమేగాక వివాహము చేసికొనని యావ్వన స్త్రీలకు కూడ యిది చెందును.

1. కుటుంబ పోషణ నిమిత్తము భర్త సంపాదించుచుండగ భార్య పిల్లలను కని వారిని పెంచుటలోను గృహసంబంధమైన పనులన్నీ చూచుకొనుచు వాటిని చక్క దిద్దు కొనుటలో స్త్రీకి సమయ మంతా సరిపోవును. స్త్రీ యొక్క ఈ బాధ్యతలన్ని టిని గూర్చి సరియైన ఆలోచన లేకుండా కొంతమంది చాల తక్కువ పని స్త్రీకున్న దని ఒక విధమైన చులకన భావము కలిగి యుందురు. తమ బిడ్డల యొక్క జీవిత ములను క్రమ పద్ధతిలో యుండునట్లు చూచుకొనుచు, వారి ఆత్మలు నిత్యజీవ ములో ప్రవేశించునట్లు మలుచుకొను నట్లు తర్ఫీదు చేసికొనుట స్త్రీకి దేవునిచే అనుగ్రహింపబడిన మెప్పు. ఈ దినము లలో హద్దుమీరి జరుగుచున్న పనులు, నేరములు, ఘోరములు ఇవన్నిటిని బట్టి చూచుచుండిన తల్లులు గృహములలో వారు చేయవలసిన పనులను విడిచిపెట్టి నందున దాని ఫలితముగ గృహములు నాశనమగు చున్నవి. ఈ సమస్యకు కారణము స్త్రీలు యింటిపనులను విడిచి, బయటి పనులను పురుషుల మాదిరిగ చేయుటయే కారణము. బయటకు వెళ్లి స్త్రీ పని చేయుటను ఎంచుకొనుటలో యే కారణము కాని, అవసరత కాని ఉండిన దాని ఫలితముగ అనేక గృహములు పతనమై పోవుటయే గాక దేవుని ద్వారా భార్యగ, తల్లిగ స్త్రీకి ఈయబడిన బాధ్యత లను స్త్రీ సక్రమముగ నిర్వర్తించక, నిరక్ష్యము చేయుచున్నదని గ్రహింపగు చున్నది.

2. బిడ్డలను గూర్చియు, ఇంటిని గూర్చియు జాగ్రత్త వహించు విషయ ములో ఎసాటియైన సహాయకారిగా యుండునట్లు తన భర్తకు పెద్ద ఆస్తి వలె కనబడునట్లు స్త్రీ తన్నుతాను సిద్ధపరచు కొనవలెను. తన భర్త ఆమె యందు యిష్టపడునట్లు మంచిగ వస్త్రధారణ చేసి కొనవలెను. వారి కుటుంబము యొక్కయు, అదే మాదిరిగ బయటి ప్రపంచమును గూర్చియు తన భర్త యొక్క ఆలోచనలను, సమస్యలను, అవసరత లను గ్రహించి తెలిసికొని వాటిలో సహభాగస్థు రాలగుటకు తన మనసును తర్ఫీదు చేసుకొనవలెను. ఆమె తన భావోద్రేకములను అదుపులో యుంచు కొని, తన భర్త యొక్క జీవితము సంతోష

దాయకముగ యుండునట్లు చూడవలెను. ఇటువంటి మంచి భార్యను గూర్చి తన భర్త మంచి స్నేహితురాలిగ, మిక్కిలి నమ్మదగిన వ్యక్తిగ ఆమెను ఎంచుకొనును.

3. **సాటియైన సహాయకారి :** భర్త యొక్క కుటుంబికు లందరితోను భార్య మంచి సంబంధము కలిగియుండునట్లు చూచుకొనవలెను. వారితో యెవరితో నైనను విరోధము కలుగును. మన ప్రభువైన యేసు ఈవిధంగా చెప్పు చున్నారు. "కంటికి కన్ను, పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్నుకుడి చెలప మీద కొట్టు వాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము. ఎవడైన నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసుకొనగోరిన యెడల వానికి నీపై వస్త్రము కూడ ఇచ్చివేయుము. ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్లు వెళ్లుము. నిన్ను అడుగు వానికిమ్ము. నిన్ను అప్పు అడుగ గోరు వాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు (మత్తయి 5:38-42). ఈ చెప్పబడిన రీతిని చేయు టకు మనము ప్రయత్నించిన యెడల కుటుంబములో సమస్యలుండవు.

4. అన్నిటికంటె ప్రాముఖ్యమైన విషయమే మనిన తన భర్త యొక్క ఆత్మీయ జీవితములో సహభాగస్థురాలై యుండవలెను. భర్త ఆరాధనలకు వెళ్లు చున్నపుడు భార్య తమ బిడ్డలతో ఇంటి దగ్గరనే యుండినచో ఆమెకుగాని, బిడ్డ లకు గాని యేవిధమైన ఆత్మీయ ఎదుగు దల యుండదు. ఒంటరిగా ఆరాధనలకు హాజరగుట వలన చివరకు తనకు కూడ ఆత్మీయ ఎదుగుదల యుండదు. కుటుం బములో పరస్పర సహకారముతో ఆత్మీ యాభివృద్ధి పొందవలెనని దేవుని ఉద్దేశ్యమై యున్నది. కుటుంబములోని వ్యక్తులందరు కలిసి వాక్యము చదువుట, దానిలోని అంశములను గూర్చి చర్చించు కొనుట, కలసి ప్రార్థించుట మున్నగు పనుల ద్వారా కుటుంబములోని వారం దరూ దైవజ్ఞాన మందు అభివృద్ధి చెందు దురు.

అపొస్తలుడైన పౌలు స్త్రీలకు ఈవిధముగ వ్రాయుచున్నాడు. సాధువై నట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకార ముగ యుండవలెను. అది దేవుని దృష్టికి విలువగలది. అటువలె పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారై యున్నారని యెరిగి, యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంత

రము కలుగ కుండునట్లు జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి (1 పేతురు 3:4, 7).

స్త్రీలారా, ప్రభువునకు వలె మీ స్వంత పురుషులకు లోబడి యుండుని ఎఫెసులో నున్న స్త్రీలకు పౌలు వ్రాయు చున్నాడు (ఎఫెసీ 5:22). భర్త తన భార్య మెడపై కాలుపెట్టి అణచుటకు దేవుడు పురుషునకు అధికార మిచ్చెనని చెప్పు చున్నాడా? ఆమెకు తన స్వంత తలంపులు ఆలోచనలు ఉండవా? ఆమెకు యేవిధమైన హక్కులు లేదా? దేవుడు ఈవిధంగా చెప్పనేలేదు. స్త్రీ తన భర్తను గౌరవించవలెనే గాని వానిని దూషించుటయైనను లేక వానిచే దూషింపబడుటయైనను జరుగకూడదు. గృహ విషయములను చక్క దిద్దుటలోను, స్వంత విషయముల కొరకు ధనమును వెచ్చించుటలోను భర్తకంటె భార్యకు జ్ఞానమును బట్టి ఆమె అర్హత గలిగిన స్త్రీగా ఎంచబడును. ప్రత్యేకించి తన బిడ్డలకు తల్లిగా, గృహ నిర్వాహకు రాలిగా ఆమె చెప్పు మాటలకు ప్రాధాన్య మీయవలెను. ఏదైనా విషయమును గూర్చి నిర్ణయములను తీసికొనవలసిన సందర్భములలో భార్య, భర్తలిరువురును కలిసి ఆలోచించి శ్రేష్ఠమైన దానిని ఎంచుకొనవలెను. అతని సలహా విషయములో ఆమె తన పలుకుబడిని వినియోగింప చూచును. కాని వాక్యానుసారముగా గృహసంబంధమైన నాయకత్వము పురుషునిదే.

భర్త యొక్క మాటలు గాని, వాని ఆలోచన విధానముగాని జ్ఞాన యుక్తముగ లేదని తెలిసికొనినపుడు ఆమె తన భర్తను జ్ఞాన యుక్తమైన సలహా అవుసరమని, సాటియైన సహాయ కారిగా ప్రేమతో, మృదువైన మాటలతో మంచి సలహాలను ఈయవలెను. ఆమె యొక్క మాటలు యెంత జ్ఞాన యుక్తముగ యుండిన వాని యొక్క ఆలోచనలు యెంత బుద్ధిహీనముగ యుండినప్పటికి వాని యొక్క ఆలోచనధోరణిని మార్చుకొను మని అతనిపై అధికారము చేయుట గాని శాసించుట గాని చేయు కూడదు. ఆ విధముగ చేసిన యెడల తన భర్త యొక్క నాయకత్వమును బలహీన పరచుటయే గాక దేవునికి అవిధేయు రాలిగా కూడ యుండును. భార్య యొక్క ఈ విధమైన ప్రవర్తనను భర్తగ తాను సహించినచో, తాను బలహీన పడుట మాత్రమే గాక తన భార్య యొక్క అధిపత్య లక్షణమును బలపరచిన వాడగును. ఇదియు కూడ దేవుని యెడల అవిధేయత కలిగి యుండుటయే. ఆఖరిగ ఒకరి యెడల ఒకరు ప్రవర్తించే ప్రవర్తను బట్టి భార్య భర్త లిరువురును దేవునికి లెక్క అప్పగించవలసిన వారై యున్నారనే విషయమును మరువవద్దు.

భార్య భర్త లిరువురును ఒకరికొకరు నడిపించుకునే విషయములో మన ప్రేమగల ప్రభువును సంఘమును ప్రేమ పూర్వకమైన ఉదాహరణలను మనకిచ్చి యున్నారు. మెట్టుకు ప్రతి పురుషుడును తనకువలె తన భార్యను ప్రేమింపవలెను; భార్య అయితే తన భర్త యందు భయము కలిగి యుండునట్లుగా చూచుకొనవలెను (ఎఫెసీ 5:33).

– బెట్టీ ఛోట్

# నిజమైన ఐక్యత

(True Unity)

యేసు తండ్రియు తాను ఏలాగు ఏకమై యున్నారో అలాగే మనమును ఏకమై యుండవలెనని ప్రార్థించారు (యోహాను 17:21). అయితే తండ్రి, ఆయన ఏలాగు ఏకమై యున్నారనేది ఇప్పుడు మన ప్రశ్న. వారు బోధయందు ఏకమై యున్నారు. యేసు ఇట్లు చెప్పారు. "నేను చేయు బోధ నాదికాదు; నన్ను పంపినవానిదే" (యోహాను 7:16). వారి వలెనే మనమును ఏకమై యుండాలని యేసు ప్రార్థించి నందువలన, ఆయన బోధించిన బోధనే మనం బోధించాలి. దానికంటె మితమైన దేదియు నిజమైన ఐక్యత కాజాలదు.

డినామినేషన్ల మధ్య శాంతియుత సహజీవనం ఉంటే అదేయేసు ప్రభువు కోరుచున్న ఐక్యతయని కొందరను కొంటారు. డినామినేషన్లు పరస్పర విరుద్ధ బోధలను చేస్తు యుంటారు గనుక ఇది అబద్ధం. ఐక్యత కలిగియుండాలంటే బోధ కూడా ఒకటే అయ్యుండాలి. దేవుని బోధకు భిన్నంగా డినామినేషన్లు ఉన్నవి. దేవుని బోధకు వ్యతిరేకంగా విభజింప బడుట పాపం.

### ఏకత్వమా? కలయికా?

మానవులు ఏకత్వానికి బదులు కలయిక సరిపోతుంది అనుకొను చున్నారు. ఈ రెంటిమధ్య చాల భేదమున్నది. ఏకత్వం అంటే వారు అన్ని విషయాల్లో ఒక్కటే అయ్యుండుట, కలయిక అంటే ఏకముకాని వాటిని అతికించుట, సమీకరించుట. ఐక్యతలో భిన్నత్వానికి తావులేదు. కలయిక అయితే మానవకల్పిత ఆమోదముపై నిర్మించబడినందున దానిలో గందర గోళానికి తావున్నది. నిజమైన ఐక్యత మానవాభిప్రాయములపై గాక దేవుని

వాక్యముపై ఆధారపడి యున్నది.

కలయికతో మానవులు సంతృప్తి జెందుచున్నట్లు కనబడుచున్నది. గాని దేవుడయితే ఐక్యతను కోరుచున్నాడు. నిజమైన ఐక్యత నెలకొల్పబడాలంటే విభాగాలు ఏర్పడడానికగు కారణాలను మనం తెలుసుకోవాలి. మానవుడు దేవుని చిత్తానికి లోబడుటకు నిరాకరించినప్పుడు విభజన కలుగుతుంది. మతపరమైన విభజనకు దేవుడు కారకుడుకాదు, నిజమైన ఐక్యతకు మాదిరి దేవుని వాక్యమే.

దేవునితో నిజమైన ఐక్యత కలిగి యుంటే మనజీవితాలకు నూతన కుటుంబముతో, అనగా సంఘముతో చేర్చబడుదుము (అపొ.కా. 2:47). క్రీస్తులో మనపై నున్న తండ్రియైన దేవుని తోనేగాక, ప్రక్కన ఉన్న సహోదరులతో సరియైన సంబంధము కలిగి యుందుము (1 యోహాను 1:3). మనం దేవుని వాక్యానికి లోబడినప్పుడు దేవునితోను, సహోదరులతోను సహవాసము కలిగి యుందుము. ఇట్టి ఐక్యతను మనం కలిగియుండాలని దేవుడు కోరుచున్నాడు. నీవాయనకు ఇంకా లోబడనట్లయితే, నీచిత్తాన్ని ఆయనకు సమర్పించి బాప్తిస్మం పొంది నీవాయనకు ఎందుకు విధేయు డవు కాకూడదు? నీవాయనతో ఏకం కావాలని ఆయన కోరుచున్నాడు. నీవు కూడా కోరుచున్నావా? మానవులు బైబిలు ఏమి చెప్పుచున్నదో మనం తెలిసికొను టకు దాన్ని పఠించాలి.

క్రైస్తవ మతశాఖలు బైబిలుపై ఆధార పడినట్టివికావు. బైబిలు గూర్చి కొంత మంది ఉపదేశకులు చేసే బోధపై విభజన లేర్పడినవి. బైబిలు మాత్రమే మన మార్గదర్శి యైనప్పుడు మనకు నిజమైన ఐక్యత ఏర్పడును. విభజన బైబిలునట్టి మాత్రం కాదు. అది మానవాభిప్రాయ ములను బట్టి యున్నది. బైబిలు ప్రమాణ పుస్తకములన్నిటిని నిష్ప్రయోజనం కావిస్తుంది. దేవుడు కోరునట్టి ఐక్యత కొరకు పాటు పడుటలో అది మాత్రమే మన మార్గదర్శియై యుండవలెను.

- జాన్ పి. గ్రే

# జ్యోతిషము : తప్పా? కాదా?

(Astrology : Right or wrong?)

గ్రహచలనము వలన మానవ జాతిపై కలుగు ప్రభావమును, భవిష్య త్తులో జరిగే సంఘటనలను చెప్పె అబద్ధ జ్ఞానాన్ని జ్యోతిషం అని మనం చెప్పు కోవచ్చు. జ్యోతిషాన్ని అనుసరిస్తు ఒకడు దేవుని సంతోషపరచగలడా? దేవుడు జ్యోతిషాన్ని ఖండించుచున్నాడు. ఈ దిగువ కారణాలను పరీక్షించు :

**1. అది నిషేధించబడిన జ్ఞానాన్ని వెదకుతుంది.** 'రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే ...యలు పరచబడినవి యెల్లప్పుడు ...నవియు మన సంతతి వారివియున ...ను" (ద్వితీ 29:29). భవిష్యజ్ఞానమును ప్రభువు తన యొద్దనే ఉంచుకొన్నాడు. కాలములను సమయములను తండ్రి తన స్వాధీన మందుంచుకొని యున్నాడు. వాటిని తెలిసికొనుట మీ పనికాదు" అపొ.కా. 1:7).

**2. అది విగ్రహారాధనతో ఆరంభ మైనది.** అన్యదేవతలకు అనగా సూర్యునికైనను చంద్రునికైనను ఆకాశ నక్షత్రములలోని దేనికైనను నమస్కరించి ఆరాధించుటను దేవుడు నిషేధించాడు. అది హేయకరము (ద్వితీ 17:2-4). మోషే చట్టప్రకారము వాటి నారాధించువారు మరణశిక్షకు పాత్రులు.

**3. అది పాడు చేయు గుణము కలది.** "యెహోవా సెలవిచ్చుచున్న దేమనగా - అన్యజనముల ఆచారములు అభ్యసింపకుడి. ఆకాశ మందు అగపడు చిహ్నములకు జనములు భయపడును. అయితే మీరు వాటికి భయపడకుడి" (యిర్మియా 10:2).

**4. అది పనికిమాలినది.** "యెహోవా నగు నేనే సమస్తమును జరిగించు వాడను. నేనొకడనే ఆకాశము లను విశాలపరచిన వాడను. నేనే భూమిని పరచినవాడను. ప్రగల్భుల ప్రవచనము లను వ్యర్థము చేయువాడను, సోదె గాండ్రను వెర్రివానిగా చేయు వాడును, జ్ఞానులను వెనుకకు త్రిప్పి వారివిద్యను అవిద్యగా చేయువాడను నేనే" (యెషయా 44:24-25).

5. అది నిష్ఫలమైనది. దేవుడిట్లు సవాలు చేయుచున్నాడు : "జ్యోతిష్కులు, నక్షత్రసూచకులు, మాసచర్య చెప్పువారు నిలువబడి నీ మీదికి వచ్చునవి రాకుండ నిన్ను తప్పించుదురేమో ఆలోచించుము. వారు కొయ్యకాలువలెనైరి. అగ్ని వారిని కాల్చి వేయుచున్నది. జ్వాల యొక్క బలము నుండి తమ్ముతాము తప్పించు కొనలేక యున్నారు" (యెషయా 47:13, 14).

లేఖనములు మన జీవనమునకున భక్తికిని కావలసిన వాటినన్నిటిని దయ చేయుచున్నవి (2 పేతురు 1:3). ప్రార్థన ద్వారా మనం దేవుని సహాయాన్ని అడుగవచ్చు. జ్యోతిషముతో సహ ప్రతివిధమైన కీడునకు మనం దూరముగా యుండాలి (1 థెస్స 5:23).

- జాన్ వాడీ

✦✦ ✦✦

'సత్యవాణి' అను మా రేడియో కార్యక్రమమును
ప్రతి ఆది, సోమ, మంగళ, గురు వారాల్లో మధ్యాహ్నం
2-00 గం॥లకు రేడియో శ్రీలంక ద్వారా వినండి !

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

# సంక్షిప్త వార్తలు

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ బ్రదర్ నెహెమ్యా గూటం గారి జ్యేష్ట కుమారుడు ఆండ్రూ ప్రమోద్ గూటం (బన్ను బాబు) 2005 నవంబరు 4వ తేదీ శుక్రవారం మోటర్ సైకిలు ఏక్సిడెంటులో చిక్కుకొని ప్రభువునందు నిద్రించిరని తెలియజేయుటకు చింతించుచున్నాము. ఆయన 35 సంవత్సరముల వయస్కులు. మరునటి రోజు శనివారం సమాధి కార్యక్రమము జరిగినది. బ్రదర్ టి.వి.యస్ కుమార్‌గారి అధ్యక్షతన ఆ కార్యక్రమము జరిగినది. అమలాపురం క్రీస్తు సంఘము దైవజనులు, టి.వి.ప్రసంగీకులు బ్రదర్ బొంతు ధనరాజు గారు ఆదరణకరమైన వాక్యములతో ప్రసంగించి దు:ఖములో యున్న కుటుంబ సభ్యులను ఓదార్చిరి.

బన్నుబాబు గారి అంతిమ యాత్రలో వందలాది బంధువులు, మిత్రులు, పట్టణ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు పాల్గొని తమ నివాళులు అర్పించిరి.

తదుపరి నవంబరు 6వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడలోని రామారావుపేటలో గల వారి స్వగృహము నందు జ్ఞాపకార్థ కూటము జరిగినది. అందు పైనుదహరించిన దైవజనులతోపాటు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, సత్యవాణి క్రీస్తు సంఘముల నుండి అనేకమంది హాజరై నెహెమ్యా గూటంగారి కుటుంబమును ఓదార్చిరి. జాషువాగూటం గారి జ్యేష్ట కుమారుడు రిక్కీ గూటంగారు కుటుంబము తరపున బన్నుబాబు గారి యొక్క విషయాలను జ్ఞాపకం చేసుకొంటూ ఆదరణకరమైన మాటలతో వందన సమర్పణ చేసి ఆ కార్యక్రమమును ముగించిరి.

దు:ఖ సాగరములో మునిగియున్న నెహెమ్యా గూటంగారి కుటుంబము కొరకై ప్రార్థించమనవి. ఈ విషాద సంఘటన జరిగేసరికి నెహెమ్యా గారి రెండవ కుమారుడు పీటర్ ప్రీతమ్ అమెరికాలోను, మూడవ కుమారుడు

జేమ్స్ ప్రశాంత్ పేరిస్ (ఫ్రాన్సు)లోను యుండుటవలన వారు స్వదేశమునకు తిరిగి రాలేక పోయిరి. మరియు అదే సమయమునకు జాషువా గూటం దంపతులు కూడ అమెరికా వెళ్లియుండిరి.

నవంబరు 30వ తేదీ బుధవారం జాషువాగూటం దంపతులు స్వగృహమునకు క్షేమముగా చేరుకొనిరని తెలియజేయుటకు సంతసించు చున్నాము. అమెరికాలో INTEL కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయుచున్న వారి రెండవ కుమారుడు సామ్యూల్ రోనీ గూటం గారి వద్ద వారు కొన్ని దినములు గడిపి, లూజియనాలో జరిగిన మిషన్ కాన్ఫరెన్స్‌లో రెండుసార్లు ప్రసంగించి దేవుని కృపవలన క్షేమముగా ఇండియా చేరుకొనిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

To

From:

**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004